22.10.1993 శుక్రవారం, 10 పేజీలు, సంపుటి: 64, సంచిక: 43, విడిప్రతి: రూ. 2.00 లు

Regd. No. HNL. 18

# జమీన్‌రైతు

కలర్ ఆటో జెరాక్స్
శ్రీ రాఘవేంద్ర ఆటో జెరాక్స్
రాధా థియేటర్ ఎదురుగా
నెల్లూరు. ఫోన్: 23649
లామినేషన్ సౌకర్యం కలదు

జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి, స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు

# అరిచే నోళ్ళన్నిటికీ సీళ్లు!

రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ తర్వాత తలెత్తిన అసమ్మతి నిప్పు పై నీళ్లు చల్లి చల్లార్చటంలో ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి దాదాపు కృతకృత్యు లయ్యారు. మాజీమంత్రి జలగం ప్రసాద రావు, ఉయ్యూరు

**జలగం, చలపతి తప్ప మరెవ్వరూ మాట్లాడడం లేదు; వారి మాటలకు విలువా లేదు!**

ఎమ్మెల్యే వంగవీటి చలపతి రావులు మాత్రం ముఖ్యమంత్రి పై కస్సు బుస్సు మంటున్నారు దాని వల్ల ముఖ్యమంత్రికి ముంచుకొచ్చే ప్రమాదం ఏమీ లేదు. మంత్రి వర్గంలో బి.సి.లకు సరైన ప్రాతినిధ్యం లభించలేదని బహిరంగంగా పత్రికల కెక్కిన మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్ ఇప్పుడు నోరు మెదపటం లేదు. ముఖ్యమంత్రి మద్దతు దారులు చిత్తరంజన్‌ను బుజ్జగించిన తర్వాత చిత్తరంజన్‌లో మార్పు కనిపిస్తోంది. అసమ్మతి ఊసెత్తితే తలదించుకొని వెళ్లి పోతున్నాడు. రాజధానిలో మాజీ ఉపముఖ్యమంత్రి సి. జగన్నాథ రావు ఇంట్లో జరిగిన బి.సి.ల సమావేశానికి కూడా హాజరు కాకుండా చిత్తరంజన్ ముఖం తప్పించాడు. చిత్తరంజన్‌ను

మంత్రి వర్గ విస్తరణ తర్వాత తనకు మంత్రి పదవి లభించలేదన్న కినుకతో శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేసిన పంతం పద్మనాభంను కూడా బుజ్జగించి మనసు మార్చుకునేలా చేయటంలో ముఖ్యమంత్రి కృతకృతు లయ్యారు. పంతం పద్మనాభం మాజీ ముఖ్యమంత్రి ఎన్. జనార్దన రెడ్డికి అత్యంత సన్నిహితుడు. పంతం చేత జనార్దన రెడ్డే రాజీనామా

**తిట్లతో హీరో అన్పించుకున్న వైఎస్‌ను ఏ మందు వేసో జీరో చేసేశారు!**

చేయించాడన్న అపప్రథ కూడా వచ్చింది. అయితే తర్వాత నిజం తెలుసుకున్న ముఖ్యమంత్రి తన మద్దతుదారుల్ని పంపి పంతంను బుజ్జగించారు. అనారోగ్య కారణంగా నగరంలోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న పంతంను స్వయంగా పరామర్శించి ముఖ్యమంత్రి రాజకీయ చతురతను ప్రదర్శించారు. దీంతో పంతం తన రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహ రించుకొని ముఖ్యమంత్రికి జై అంటూ తిరుగుతున్నారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే డాక్టర్ రాజశేఖర రెడ్డిని లోబరుచు కోవటంలో ముఖ్యమంత్రి ప్రదర్శించిన రాజకీయ చతురత ఒక్కటే ఒక ఎత్తు. ఇటీవల ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి పై విమర్శనాస్త్రాలు సంధించి హీరో అన్పించుకున్న వై.ఎస్. చేత "అబ్బే నేనలా అన్లేదే, అదంతా పత్రికల వారి వక్రీకరణ" అంటూ వివరణ ఇప్పించి వై.ఎస్.ను రాజకీయంగా జీరో చేసిన ఘనత ముఖ్యమంత్రిదే. వై.ఎస్.లో వచ్చిన మార్పుకు రాజకీయ వర్గాలన్నీవిస్తుపోయాయి. వై.ఎస్ మనసు మార్చడంలో రెవిన్యూ మంత్రి రామిరెడ్డి పాత్ర వుందట. ఏదైతే నేం ముఖ్యమంత్రి తన రాజకీయ

**చిత్తరంజన్ ముఖం చాటేశాడు; 'పంతం' పంతం మాని జై కొడ్తున్నాడు!**

రహదారిలో అసమ్మతి ముళ్లను ఒక్కొక్కటిగా ఏరి పారేయడంలో విజయం సాధిస్తున్నారు.

# కోట్ల ఢిల్లీకి వెళ్లి వస్తే తప్పేమి?

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి ఎక్కువ కాలం ఢిల్లీలో గడుపుతూ రాష్ట్ర పరిపాలనను పట్టించు కోవడం లేదన్న విమర్శ ఇటీవల ఎక్కువగా విన్పిస్తోంది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ వారు ఈ విషయంలో ముఖ్యమంత్రిని ఘాటుగా

**జీతాలిచ్చేందుకూ గతి లేని దుర్గతిలో పడిన ఖజానాను కోట్ల ఢిల్లీ నుంచి తెచ్చే కోట్లు మాత్రమే దివాలా తీయకుండా కాపాడ గల్గుతున్నాయి. ఈ నిజాన్ని కాంగ్రెస్ వాదులు సహేతుకంగా ప్రజలకు వివరించి చెప్పలేకున్నారు!**

విమర్శిస్తూ, ప్రస్తుతం రాష్ట్రంలో ఫుల్ టైమ్ ముఖ్యమంత్రికి బదులు 'విజిటింగ్ ముఖ్యమంత్రి' 'టెలిఫోన్ ముఖ్యమంత్రి' పరిపాలన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. శ్రీ కోట్ల ఏడాది పాలనలో సుమారు 120 రోజుల పాటు ఢిల్లీలోనే గడిపారని, రాష్ట్రంలో కరువు, వరదలు, ఇతర సమస్య లెన్ని వున్నా పట్టించు కోకుండా ఢిల్లీ విమానం ఎక్కేస్తున్నారని తెలుగుదేశం వారి ప్రధాన ఆరోపణ. తెలుగుదేశం పార్టీ విమర్శ పై కాంగ్రెస్ పార్టీ వారు స్పందిస్తూ "నిజమే కోట్ల వారు ఎక్కువ కాలం ఢిల్లీలో వుంటున్నారు. అయితే ఆయన సరదాకో లేక కాలక్షేపానికో ఢిల్లీకి వెళ్లడం లేదు. పార్టీ వ్యవహారాలను చూసుకుంటూ పనిలో పనిగా రాష్ట్రానికి అనేక కొత్త ప్రాజెక్టులను, వీలైనంత ఎక్కువగా నిధుల్ని రాబట్టుక వస్తున్నారు. దీని వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతోంది" అంటూ వివరణ ఇస్తున్నారు.

ముఖ్యమంత్రి కాక మునుపే కోట్ల విజయ భాస్కర రెడ్డి జాతీయ రాజకీయాల్లో వున్నారు. కేంద్ర మంత్రిగా వుంటూనే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత పార్టీ క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ అయ్యారు. ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఆయనకు ఢిల్లీ పదవుల బాధ తప్పలేదు. ముఖ్యమంత్రి హోదాలో అప్పుడప్పుడు ఢిల్లీ ప్రయాణాలు తప్పవు. పార్టీలో కీలకమైన పదవుల్లో వున్న కారణంగా పార్టీ సమావేశాలకు వెళ్లడం తప్పని సరి అవుతోంది. దీనితో ముఖ్యమంత్రి ఎక్కువగా ఢిల్లీలో మకాం వేస్తున్నారన్న విమర్శకు కాళ్లొచ్చాయి. కాంగ్రెస్ ముఖ్యమంత్రులకు ఢిల్లీ యాత్రలు కొత్తేమీ కాదు. అందులో అధిష్టానంలో వుండే కోట్ల వంటి వారి సంగతి వేరే చెప్పాల్సిన పని లేదు. తెలుగుదేశం పార్టీ వారికి "ఢిల్లీ" పోటు లేదు కాబట్టి వాళ్లు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల పై ఈ విధమైన విమర్శలు చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ వారు కూడాపొంతన లేని మాటలు మాట్లాడి ఈ వివాదాన్ని మరింత పెద్దది చేస్తున్నారు. "ముఖ్యమంత్రి ఢిల్లీలో ఎక్కువ కాలం వుంటున్నా రాష్ట్రంలో పరిపాలనను నిర్లక్ష్యం చేయటం లేదని, ఆయన ఇక్కడి విషయాలు ఎప్పటికప్పుడు తెలుసు కుంటూ "టెలిఫోన్ పైనే ఆదేశాలు జారీ చేస్తున్నారని" కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ కార్యదర్శి కోదండ రెడ్డి ప్రభృతులు సమర్థించారు. దీని పై తెలుగుదేశం పార్టీ వారు స్పందిస్తూ "టెలిఫోన్ ద్వారా ప్రభుత్వాన్ని నడిపే ముఖ్యమంత్రి వుండటం మన రాష్ట్ర దౌర్భాగ్యం" అని ప్రతి విమర్శ

**ఢిల్లీకి పోక పోయినా ఎన్టీఆర్‌కు అధిక సమయం గండిపేటలోనే సరిపోయేది; విమర్శించడానికి ఏదీ దొరకక ఢిల్లీ యాత్రల బూరగ వూదుతున్నారు. కోట్ల పై ఒక్క అవినీతి ఆరోపణా చేయలేక పోవడం కాంగ్రెస్ సమర్థతకు నిదర్శనం!**

చేశారు. ఆ తర్వాత ఆర్థిక శాఖ మంత్రి రోశయ్య విలేఖరుల సమావేశం పెట్టి ముఖ్యమంత్రి "ఢిల్లీ విజయాలను" ఏకరువు పెడ్తూ ఒక జాబితా విడుదల చేశారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో వుండటం కంటె ఢిల్లీలో వుండటమే మనకు మేలన్న అభిప్రాయాన్ని ఆయన రుద్దారు. దీని మీద మళ్లీ తెలుగుదేశం పార్టీ వాళ్లు విలేఖరుల సమావేశం పెట్టి రోశయ్య చెప్పిన లెక్కలన్నీ కాకి లెక్కలని తేల్చి పారేశారు. ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లక పోయినా రొటీన్‌గా వచ్చే పథకాలు, నిధులు ఎలాగూ వస్తాయని దేశం వారు సెలవిచ్చారు. నిష్పక్షపాతంగా ఆలోచిస్తే కోట్ల వారి ఢిల్లీ యాత్రల వల్ల కొంప మునిగి పోయిందేమీ లేదు. పైగా దాని వల్ల అనేక పెండింగ్ ప్రాజెక్టులకు విముక్తి లభించింది. తెలుగుదేశం ఏడేళ్ల పాలనలో మగ్గిపోయి కాగితాల్లో చెదపట్టిన అనేక పథకాలు ఇప్పుడు రాష్ట్రానికి నడచి వచ్చాయి. కాంగ్రెస్ పార్టీలో సీనియర్‌గా కేంద్ర మంత్రిగా వుండిన కోట్ల వారి పరిచయాలు మన రాష్ట్రానికి మేలు చేస్తున్నా యనడం నిస్సందేహం. కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏదో ఒకటి

గరప 10 పేజీ

# నూట ఆరు కోట్లతో జిల్లాలో భారీ పరిశ్రమలు

జిల్లాలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు పరిశ్రమలు అధికం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని రాష్ట్ర అర్థికాభివృద్ధి సంస్థ ఛైర్మన్, ఆత్మకూరు శాసనసభ్యుడు డాక్టర్ బి. సుందర రామిరెడ్డి అన్నారు. సోమవారం పారిశ్రామిక కేంద్రంలో జరిగిన పారిశ్రామిక దినోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి విజయ భాస్కర రెడ్డి రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన పారిశ్రామిక విధానాల వల్ల నిరుద్యోగ సమస్య తీరగలదన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. జిల్లాలో ధనవంతులు తగినంత మందివున్నా అనుకొన్నంత పారిశ్రామిక అభివృద్ధి సాధించ లేక పోయిందన్నారు. సభాధ్యక్షత వహించిన ప్రభుత్వ విప్ సర్వేపల్లి శాసనసభ్యుడు సి.వి. శేషారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలనతో పాటు దారిద్ర నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషిచేస్తుందన్నారు. జిల్లాలో ఈ సంవత్సరం 106కోట్ల రూపాయల పెట్టుబడితో 22 భారీ మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పుతున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ రాజశేఖరయ్య చెప్పారు. దీని ద్వారా 5,900మందికి వుపాధి అవకాశాలు కల్గుతాయని వెల్లడించారు.

## సమైక్యతకు చిహ్నాలు క్రీడలే!

దేశ సమైక్యతకు క్రీడలు దోహదాలని జిల్లా జడ్జి శ్రీ ఇస్మాయిల్ వుద్బోధించారు. శనివారం ఎ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో 41వ సీనియర్ అంతర జిల్లాల కబాడీ ఛాంపియన్ షిప్ పోటీల సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. క్రీడలు సుహృద్భావ సంబంధాలను నెలకొల్పి

## నెల్లూరు సంగతులు

అభివృద్ధికి బాటలు వేస్తాయన్నారాయన. పోటీలను ప్రారంభించిన ఎస్.పి. శ్రీ టి. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కబాడీ అన్ని క్రీడలకన్నా మిన్నదంటూ, ప్రతిభగల క్రీడాకారులను ప్రభుత్వం తప్పక గౌరవించాలన్నారు. గెలుపు, ఓటములను మరచి క్రీడల్లో పాల్గొనడాన్ని ముఖ్యాంశంగా క్రీడాకారులు భావించాలన్నారు. రాష్ట్ర కబాడీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమాప్రసాద్, స్టేడియం ఇన్‌ఛార్జి జగన్నాధరెడ్డి, అజిత్‌బాబు, రవిదేవరెడ్డి ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు. అత్యంత ఉత్కంఠ భరితంగా రెండురోజుల పాటు జరిగిన పోటీల్లో నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల జట్లు పాల్గొన్నాయి. విజయనగరం జిల్లా జట్టు ఓడించి ప్రకాశం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు జిల్లాకలెక్టర్ శ్రీ ఎం. సాంబశివరావు బహుమతులంద జేశారు. జిల్లా కబాడీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ అనపల్లి అశోక్ కుమార్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గ్రంథా విష్కరణ సభ

వర్తమాన సమాజం 24 తేది టౌన్‌హాల్‌లో 'స్వర్గయానం' గ్రంథా విష్కరణ సభను ఏర్పాటు చేసింది. సభాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి;హైకోర్టు న్యాయమూర్తి శ్రీ సన్నపు రెడ్డి దశరధరామ రెడ్డి ఆవిష్కరిస్తారు. ప్రముఖ రచయిత శ్రీ నాగభైరవ కోటీశ్వర రావు, విద్యద్కవి శ్రీ మాన్ మదివర్తి కొండమాచార్యులు, కవి శ్రీ ఎం. జాన్ గ్రంథాన్ని సమీక్షిస్తారు. ఛార్టర్ అకౌంటెంట్ శ్రీ డి.వి. రమణయ్య ముఖ్య అతిధిగా విచ్చేస్తారు ఈ సభ గ్రంధకృతి కర్త లేబర్ ఆఫీసర్ శ్రీ డి. నాగయ్య. కృతిభర్త శ్రీ పి.సి. సుబ్బరాయలు శెట్టి.

కొరవ 9 పేజీలో



నెల్లూరుగాంధీబొమ్మ సెంటర్‌టాక్సీడ్రైవర్లుమహారాష్ట్ర భూకంపబాధితుల సహాయార్థం5000/-రూపాయలచెక్కు నుకలెక్టర్‌సాంబశివరావుగారికిఅందజేస్తున్నదృశ్యం

## సణుగుడు

## * సత్యసాయి అసత్యం మరొకసారి వెల్లడైంది
## * గెస్ట్‌హౌస్‌లో ఏమిటో ఆ గొడవ?

నేతి బీరకాయలోనైనా నెయ్యి వుంటుందేమోగాని, సత్యసాయి బాబాలో మాత్రం ఆవగింజంత సత్యం వుండదని మరొకసారి వెల్లడైంది. సాయిబాబాను పదేపదే విమర్శించడం నా ఉద్దేశ్యం కాదు. అతడి మీద నాకు వ్యక్తిగత కోపతాపాలేవీ లేవు. అతగాడి ముఖం కూడా నేనెప్పుడూ చూడలేదు; చూడాలనీ అనుకోవడం లేదు. అయితే మరీ దుర్మార్గంగా, పచ్చిగా, తానే దేముడ్నని దబాయించి, జనాన్ని వెర్రివెంగళప్పలను చేసే ఇటువంటి దొంగబాబాల పచ్చిమోసాలను వీలైనప్పుడల్లా వివరించి చెప్పడం ఎంతైనా అవసరమనే ఉద్దేశ్యంతోనే ఈ ప్రస్తావన తేవడం.

మన ఖర్మకాలి- రాష్ట్రపతి, ప్రధాన మంత్రి పదవుల్లో వుండేవారు పరమ ఛాంధసులు, పదవి నిలస్తుందని చెప్తే కాషాయం కట్టుకొన్న ఏ కపట సన్యాసికైనా కాళ్ళు

**డోలేంద్ర**

కడిగే దౌర్బల్యులు కావడంతో సాయిబాబా వంటి వారు ఇంకా ఎయిర్ కండిషన్డ్ గదులలో హంసతూలికా తల్పాలపైన విలాసాలను భవిస్తున్నారు కాని, అదే ఇంకో దేశంలో అయితే ఈ

కొరవ 6 పేజీలో


# సంస్మరణ

మా కుమారుడు

## దేవళ్ళ ప్రభాకరరెడ్డి

పరమపదించి 22-10-93తేదికి మూడు సంవత్సరాలు నిండినవి.

## తృతీయ వర్ధంతి

సందర్భంలో వారి ఆత్మకు చిరశాంతిని కలుగ జేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

దేవళ్ళ రామచంద్రారెడ్డి
శకుంతలమ్మ
మోదేగుంట.



జననం : 11-12-1948 మరణం: 22-10-1990

## కోట్ల

( మొదటి పేజీ కొరవ )

విమర్శించాలన్న తపన తప్పితే దేశం వారసలో పసలేదు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి హోదాలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తన శాస్త్రి కాలాన్ని రాష్ట్రానికి కేటాయించారా? లేదే! పార్టీ సమావేశాలకు గంటలు గంటలు వెచ్చించే వారు; గండిపేటలో ప్రతి రోజూ ఏదో ఒక సమావేశానికి రామారావు హాజరయ్యే వారు. అది తప్పు కూడా కాదు. మన రాజకీయ వ్యవస్థలో పార్టీకి ప్రభుత్వానికి విడదీయలేని సంబంధం వుంది. అలాగే కోట్ల వారు కూడా కొంత కాలాన్ని పార్టీ కోసం వినియోగిస్తే మాత్రం తెలుగుదేశం వారికి కన్ను కుట్టింది. కాకపోతే తెలుగుదేశం హెడ్‌ఆఫీస్ మెయిన్ బ్రాంచ్ కూడా హైదరాబాదులోనే వుండటం. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వుండటంతో ఎన్టీఆర్‌కు ఢిల్లీ విమానం ఖర్చులు తగ్గాయి. ఆ మేరకు ఢిల్లీ నుంచి మనకు రావాల్సిన పథకాలు, నిధులు కూడా తగ్గి పోయాయన్న సంగతి ఇక్కడ గమనించాలి. గత ముఖ్యమంత్రులతో పోల్చుకుంటే కోట్ల వారి ఏడాది పాలనలో కేంద్రం నుంచి మనకు పెద్ద మొత్తంలో లాభం చేకూరిందనడం వాస్తవం. ప్రస్తుతం రాష్ట్ర ఖజానా వట్టి పోయి వుంది. ప్రజాకర్షణ పథకాలతో తెలుగుదేశం ఏడేళ్ల పాలనలో రాష్ట్ర ఖజానాకు చిల్లు పెట్టింది. రాష్ట్రంలో సారా నిషేధం, సబ్సిడీ బియ్యం, పెన్షను ధర పెంపు వంటి వాటితో ఖజానా పై పెనుభారం పడింది. ఈ పరిస్థితుల్లో అభివృద్ధి కార్యక్రమాల కోసం కేంద్రం పై దృష్టి కేంద్రీకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో ఉద్యోగులకు సైతం జీతాలివ్వ లేని దుస్థితి వచ్చే ప్రమాదం వుందని ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఇక్కడ గమనించాలి. నియోజక వర్గాల్లో ఫలానా పని కావాలని ఎమ్మెల్యేలు వెళ్లి అడిగితే డబ్బులేదు క్షమించండి అంటూ ముఖ్యమంత్రి చేతులెత్తే పరిస్థితి నెలకొన్నదంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అందుకే కోట్ల వారు ఢిల్లీ పై కన్ను వేసి మనకు రావాల్సిన దాని కంటే కాస్తంత ఎక్కువే రాబట్టున్నారు. దీన్ని కూడా తెలుగుదేశం (ఆ) రాజకీయం పేరుతో దుమ్మెత్తి పోయడం విచారకరమైతే, ముఖ్యమంత్రి ఢిల్లీ విజయాన్ని సక్రమ రీతిలో సమర్థించుకోలేక పోవడం పాలక పక్షం దౌర్బల్యం.

## 50 ఏళ్ళ క్రితం

3 పేజీ కొరవ

### పద్మనాభయ్య అస్తమయం

పోలీసు ఉద్యోగిగా వుండి 1920 లో సహాయ నిరాకరణోద్యమంలో రాజీనామా నిచ్చిన త్యాగశీలి తూములూరు అనంత పద్మనాభయ్య గారు 20 తేది రాత్రి అస్తమించారన్న విచార వార్త బహునను దుఃఖ సాగరములో ముంచింది.

వీరు చేసిన అన్ని కార్యములలోకి చిరస్మరణీయమైంది తిప్పరాజా సత్రం వద్ద గోడ వ్రాతలు దీని సృష్టి కర్త వీరే. ప్రథమంలో పోలీసు జులుంతో ఢీకొని దాన్ని నిలబెట్టిన వీరి ప్రతిష్ట ఎన్నాళ్లకీయు తరగదు.

యిలాంటి వ్రాతలు రష్యాలో తప్ప మరెక్కడ యింతటి ప్రశస్తి పొందలేదు. త్యాగ, ధైర్య, స్థైర్య, పట్టుదలలో యింతటి వ్యక్తిని మరొకర్ని చూడబోము.

అట్టి వ్యక్తిని గోల్పోవడం మన దురదృష్టం. వీరి ఆత్మకు శాంతి కలుగుగాక. వీరి కుటుంబానికి మా ఓదార్పులు.

వీరి అంత్యక్రియలకు ఏ లోటు లేదు గాని, కట్టెలు దొరకక మధ్యాహ్నం వరకు చాలా బాధపడవలసి వచ్చుట విచారకరం.

### కడపటి వార్తలు

వెంకటగిరి నౌకర్ల జీతాలు వగైరాలు యిచ్చారనీ, సమ్మె అంతమైందనీ కడపటి వార్త.

- విమర్శకుడు

## వెంకటగిరి నౌకర్ల సమ్మె!!

తాలూకా గుమాస్తాలకు, జమానులకు గత 2,3 మాసాల జీతాలు, 4 మాసాల బత్తాలు యివ్వలేదట. మేపటానికి రైతుల వద్ద సత్తాలేదు. అప్పులు ఇవ్వడానికి వీరి ఉద్యోగాల మీద నమ్మకం లేదు. అందువల్ల కొంపలు జరగలేదు.

కావున నాయుడుపేట, మల్లాం, యాకసిరి, బాలిరెడ్డిపాళెం. 4 తాలూకాల గుమాస్తాలు, జమానులు 17 తేది నుండి సమ్మె కట్టారు. సమ్మె జోరుగా సాగుతున్నది. నాయుడుపేట బజారంతా వస్తేటు మీద మంగళహారతులతో నిండి పోతున్నది.

తహ- వగైరా 4 గురు మాత్రం యాగలు తోలుకుంటూ ఆఫీసుల్లో కునికిపాట్లు బడుతున్నారు.

- నాయుడుపేట విలేఖరి.

జమీన్‌రైతు
సంవత్సర చందా రు 100/-
6 నె లలకు రు 50/-

**బలాది లేహ్యం**

నరములు బలహీనత, గుండె దడ, ఆయాసము, బ్లడ్ ప్రెషరు, మొదలగు వాని పై పనిచేయును. జీర్ణశక్తి, రక్తపుష్టి బలము ఉత్సాహమును కలిగించును.
200 గ్రాముల సీసా రూ. 40/- మా వద్ద ప్రశస్త ఆయుర్వేద ఔషధములు లభించును.

**జనార్దన ఆయుర్వేద ఫార్మసి**
4/607, ఉస్మాన్‌సాహెబ్‌పేట,
నెల్లూరు - 524 002.

SERVICE... SERVICE... SERVICE... SERVICE

**శ్రీ సాయి హోం నీడ్స్ సర్వీసెస్**

16/715, శంకర అగ్రహారం, OPP: విజయశ్రీ లాడ్జి, బృందావనం, నెల్లూరు.

మోడైనందిన జీవితంలో మీ కెన్నో సమస్యలు... పనులు... ఈ బిజీ లైఫ్‌లో మీరు కొన్ని కొన్ని పనులు మీరే స్వయంగా చేసుకోవాలంటే మీకు అదనపు శ్రమ... మరియు సమయం కూడా వృధా.... అందుకే కేవలం నెలకు 10 రూ చందా తో ఈ క్రింది పనులు మీ సౌకర్యం కోసం మేము చేసి పెట్టగలం టెలిఫోన్ బిల్స్, కరంట్ బిల్స్, RTC, రైల్వే రిజర్వేషన్స్, ఎలక్ట్రిషియన్స్, పైప్ లైన్స్ వర్క్స్, అద్దెకు కార్లు, మెడికల్ అసిస్టెన్స్, ఇంతే కాక మరెన్నో పనులు మీరడిగిన వెంటనే చేసి మీకు సహకరించ గలం.

వివరములకు సంప్రదించండి PH: 27901

పులుగుండ్ల శ్రీనివాసులు - ఎస్. రఘురామ్

SERVICE... SERVICE... SERVICE... SERVICE

# ఆరవ వర్థంతి

## డా. పి. శ్రీనివాసులు రెడ్డి గారు

చిన్న పిల్లల డాక్టర్ Paediatrition



*నీతో వెన్నెలను తీసుకపోయావు*
*మాకు చీకటి మిగిల్చావు*
*నీతో వసంతాన్ని తీసుకపోయావు*
*మాకు శిశిరం మిగిల్చావు*
*విషాదపు మేఘాలు*
*మా మనసుల్ని ఆక్రమించాయి*
*నీవు వెదజల్లిన*
*స్నేహార్ద్ర సౌరభాల్ని*
*అనుదినమూ ఆస్వాదిస్తూ*
*నీ స్మృతుల నక్షత్రాల్ని*
*మా గుండెల్లో దాచుకుంటాం*

జననం: 26.4.1943 మరణం: 23.10.1987

ఆర్ద్ర హృదయాలతో

- కుటుంబ సభ్యులు

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press. OFFSET Printing at Nayagara Paper Products (India) Ltd.